# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 02-04-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- దేశ ఆకాంక్షలకు అనుగుణంగా పౌర కేంద్రీకృత పాలన అవసరమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- పెట్రోకెమికల్ ఉత్పత్తులపై వచ్చే జూన్ 30 వరకు కస్టమ్స్ సుంకం మినహాయింపు ఇవ్వనున్నామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.
- పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు నేటితో ముగిశాయి.
- దేశంలో 2030 నాటికి 100 కోట్ల మంది పౌరులకు 5జీ సేవలు అందుబాటులోకి రానున్నాయని కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు.
- కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్ల మధ్య ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

వేగంగా మారుతున్న దేశ ఆకాంక్షలకు అనుగుణంగా పౌర కేంద్రీకృత పాలన అవసరమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈరోజు జరిగిన 'కర్మయోగి సాధన సప్తాహ్-2026'ను ఉద్దేశించి ప్రధానమంత్రి వర్చువల్ గా ప్రసంగించారు. ప్రస్తుతం ప్రభుత్వ పాలన 'నాగరిక దేవో భవ' అనే మంత్రంతో ముందుకు సాగుతోందని, ప్రభుత్వ సేవలను మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరువ చేయడం లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి భారతీయుని ఆకాంక్షలకు అనుగుణంగా ఆధునిక, అంకితభావం గల శ్రామిక శక్తిని రూపొందించడంలో కెపాసిటీ బిల్డింగ్ కమిషన్, మిషన్ కర్మయోగి కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. అభివృద్ధి చెందిన దేశం కేవలం మౌలిక సదుపాయాలు, సాంకేతికతపైనే కాకుండా నైపుణ్యం, నిబద్ధత కలిగిన మానవ వనరులపై ఆధారపడి నిర్మించబడుతుందని నరేంద్రమోదీ పేర్కొంటూ…

(వాయిస్ 26 సెకన్లు)

కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ ఈరోజు నుండి వారం రోజుల పాటు సాధన సప్తాహ్-2026ను పాటిస్తుంది. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రిత్వ శాఖలు, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, 250కి పైగా సివిల్ సర్వీసెస్ శిక్షణా సంస్థలు పాల్గొంటాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంఘర్షణల కారణంగా ప్రపంచ సరఫరా వ్యవస్థల్లో తలెత్తుతున్న అంతరాయాలను దృష్టిలో పెట్టుకొని కీలకమైన పెట్రోకెమికల్ ఉత్పత్తులపై వచ్చే జూన్ 30వ తేదీ వరకు పూర్తి కస్టమ్స్ సుంకం మినహాయింపు ఇవ్వనున్నామని ప్రభుత్వం ఈరోజు ప్రకటించింది. పశ్చిమాసియాలోని తాజా పరిణామాలపై జరిగిన అంతర మంత్రివర్గ మీడియా సమావేశంలో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ (CBIC) సభ్యుడు సంజయ్ మంగళ్ మాట్లాడుతూ... దేశీయ పరిశ్రమకు కీలకమైన పెట్రోకెమికల్ ముడిసరుకుల లభ్యతను నిర్ధారించడానికి, దేశంలో సరఫరా స్థిరత్వాన్ని కాపాడటానికి ఈ చర్యను తాత్కాలిక ఉపశమనంగా తీసుకున్నట్లు తెలిపారు. ఈ మినహాయింపు వల్ల పెట్రోకెమికల్స్, ప్లాస్టిక్స్, టెక్స్‌టైల్స్, ఫార్మాస్యూటికల్స్ వంటి మధ్యంతర ఉత్పత్తులపై ఆధారపడిన అనేక రంగాలకు ప్రయోజనం చేకూరుతుందని ఆయన వివరిస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ మాట్లాడుతూ... దేశంలో ముడి చమురు లభ్యత సాధారణంగా ఉందని, రిఫైనరీలు గరిష్ట సామర్థ్యంతో పని చేస్తున్నాయని తెలిపారు. రాబోయే 60 రోజులకు సరిపడా ముడి చమురు సరఫరాను నిర్ధారించడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు నేటితో ముగిశాయి. ఈ ఏడాది బడ్జెట్ సమావేశాలు మొదటి విడత జనవరి 28న ప్రారంభమై ఫిబ్రవరి 13 వరకు కొనసాగింది. అనంతరం రెండో విడత సమావేశాలు గత నెల 8న ప్రారంభమై ఈరోజుతో ముగిశాయి. అయితే కొన్ని కీలక బిల్లులను ఆమోదించడానికి రెండు వారాల విరామం అనంతరం పార్లమెంట్ ఏప్రిల్ 16న తిరిగి సమావేశమవుతుంది. లోక్‌సభ సీట్ల సంఖ్యను 543 నుండి 816కు పెంచే బిల్లును ఆమోదించడానికి, తద్వారా మహిళా రిజర్వేషన్ చట్టాన్ని వీలైనంత త్వరగా అమలు చేయడానికి ఈ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. చేస్తారు. సభ ఈరోజు పలు కీలక బిల్లులపై చర్చ చేపట్టి అనంతరం ఏప్రిల్ 16 వాయిదా పడింది. అంతకుముందు రాజ్యసభలో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ... ఒక కీలకమైన చట్టాన్ని పరిశీలించడానికి సభ మళ్లీ సమావేశమవుతుందని చెప్పారు. తమ వద్ద కొన్ని బిల్లులు ఉన్నాయని.. తాము వాటిని ప్రతిపక్షాలతో ఇప్పటికే పంచుకున్నామని చెప్పారు. రాబోయే రెండు వారాల్లో తాము చాలా ముఖ్యమైన బిల్లును తీసుకురాబోతున్నామని కిరణ్ రిజిజు వెల్లడించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో 2030 నాటికి 100 కోట్ల మంది పౌరులకు 5జీ సేవలు అందుబాటులోకి రానున్నాయని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. లోక్ సభ ప్రశ్నోత్తరాలకు ఈరోజు ఆయన సమాధానమిస్తూ.. కమ్యూనికేషన్ విప్లవం కేవలం మెట్రో నగరాలకే పరిమితం కాకుండా... దేశవ్యాప్తంగా ఉన్న గ్రామాలకు చేరుతోందని చెప్పారు. ఇది పౌరుల జీవనశైలిని, విద్యను, ఆరోగ్యాన్ని, జీవనోపాధిని సరికొత్తగా తీర్చిదిద్దుతోందని ఆయన వివరించారు. భారత్ ఇకపై సాంకేతికతను అనుసరించే దేశం కాదని, సాంకేతికతకు నాయకత్వం వహించే దేశంగా అవతరించిందని పేర్కొన్నారు. గత దశాబ్ద కాలంలో దేశంలో బ్రాడ్‌బ్యాండ్

అనుసంధానం అనూహ్యంగా పెరిగిందని వెల్లడించారు. పదేళ్ల క్రితం కేవలం 6 కోట్లుగా ఉన్న కనెక్షన్‌ల సంఖ్య నేడు 100 కోట్లకు చేరుకుందని తెలిపారు. 2030 నాటికి ఈ డిజిటల్ మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయడమే కాకుండా దేశం నలుమూలలా మరింత విస్తరించడమే ప్రభుత్వ లక్ష్యమని జ్యోతిరాదిత్య సింధియా స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

రాజ్యసభలో రెండు కీలక బిల్లులు ఈరోజు ఆమోదం పొందాయి. జన్ విశ్వాస్ (సవరణ నిబంధనలు) బిల్లుకు సభ ఆమోదం తెలిపింది.  చిన్నపాటి వ్యాపార నేరాలను నేరరహితం చేయడం, సులభతర వాణిజ్యాన్ని మెరుగుపరచడం కోసం ఈ బిల్లు ఉద్దేశించబడింది. ఇది 80కి పైగా కేంద్ర చట్టాలను సవరిస్తూ.. జైలు శిక్షలను జరిమానాలుగా మారుస్తుంది. తద్వారా విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం, నియంత్రణ భారాన్ని తగ్గించడం దీని ముఖ్య ఉద్దేశ్యం. అదే విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ బిల్లు-2026కు కూడా రాజ్యసభ ఆమోదం తెలిపింది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ ఈ బిల్లును ఉదయం సభలో ప్రవేశపెట్టగా.. ఛైర్మన్ సీ.పీ. రాధాకృష్ణన్ చర్చకు అనుమతించారు. మొత్తం 11 పార్టీలకు చెందిన 17 మంది సభ్యులు ఈ బిల్లుపై చర్చలో పాల్గొని 10 పార్టీలకు చెందిన ఎంపీలు బిల్లుకు అనుకూలంగా మద్దతిచ్చారు. కేవలం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రమే బిల్లును వ్యతిరేకించి సభ నుంచి వాకౌట్ చేసింది. మూజువాణి ఓటుతో బిల్లు ఆమోదం పొందిన అనంతరం ఛైర్మన్ సీ.పీ.రాధాకృష్ణన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఇక రాష్ట్రపతి ఆమోదంతో ఈ బిల్లు చట్టరూపం దాల్చనుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్ల మధ్య ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన కోల్‌కతా బౌలింగ్ ఎంచుకోవడంతో బ్యాటింగ్ ప్రారంభించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు 10 ఓవర్లు పూర్తయ్యేసరికి 2 వికెట్లు కోల్పోయి 123 పరుగులు చేసింది. ఓపెనర్లు అభిషేక్ శర్మ, ట్రావీస్ హెడ్ తొలి వికెట్ కు 82 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

రక్షణ రంగ ఎగుమతులు 2025-26 ఆర్థిక సంవత్సరంలో 38 వేల 424 కోట్ల రూపాయలతో రికార్డ్ నెలకొల్పాయి. గత ఏడాదితో పోలిస్తే 62.66 శాతం వృద్ధి నమోదైంది. ఇందులో ప్రభుత్వ రంగం 54.84 శాతం ఉండగా.. ప్రైవేట్ రంగం 45.16 శాతం వాటా కలిగి ఉన్నాయి. ఈ గణనీయమైన పెరుగుదల భారతదేశంలో తయారైన రక్షణ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న గిరాకీని స్పష్టం చేస్తోందని రక్షణ మంత్రిత్వ శాఖ పేర్కొంది. భారత రక్షణ రంగంలో ఇదొక చారిత్రాత్మక విజయమని ఆ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. రక్షణ పరికరాల తయారీకి భారతదేశం ప్రపంచ కేంద్రంగా మారేదిశగా ముందుకు సాగేందుకు ఇది ఒక భారీ అడుగు అని సామాజిక మాధ్యమం పోస్ట్ లో పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా ఈరోజు హనుమాన్ జయంతి వేడుకలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరిగాయి. హనుమంతుని జన్మదినాన్ని పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేశ రాజధాని ఢిల్లీలో తెల్లవారుజాము నుంచే భక్తులు హనుమాన్ ఆలయాలకు వెళ్లి ప్రార్థనలు చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = =